అక్రమ పోస్టింగ్‌లపై విజిలెన్స్ విచారణ చేపట్టాలి

సేవ్ టీచర్స్ యూనియన్ జిల్లా నేతల డిమాండ్

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : అక్రమ టీచర్ పోస్టింగ్‌లపై విజిలెన్స్ విచారణ జరిపించాలని సేవ్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు తోటిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కంబాలపల్లి జగదీశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాజేంద్రనగర్ మండలం పద్మశాలిపురంలో ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు ఏప్రిల్‌లో రిటైర్డ్ అవుతున్నట్లు తెలిపారు. ఈ ఉపాధ్యాయుడు నిబంధనలకు విరుద్ధంగా జీవో 317 అమలు సమయంలో ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లిలో పనిచేస్తున్నట్లు, అప్పుడు సీనియారిటీ జాబితాలో ఈ టీచర్ సీరియల్ నెంబర్ 616 ఉండి నాగర్‌కర్నూల్ జిల్లాకు కేటాయించినట్లు తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో సీనియారిటీ కటాఫ్ సీరియల్ నెంబర్ 300లోపు మాత్రమేనని, సీరియల్ నెంబర్ 616 ఉన్న ఈ టీచర్ డీఎస్ఈలో ఉన్న అధికారుల అండదండలతో ఐఎఫ్ఎంఐఎస్ సైట్‌లో తన పేరును ట్యాంపరింగ్ చేసుకొని నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి రంగారెడ్డికి మార్చుకున్నాడని తెలిపారు. 2021 నుంచి రంగారెడ్డి జిల్లాలోనే కొనసాగుతున్నాడని చెప్పారు. 2024లో జరిగిన బదిలీల్లో ఆయన జడ్పీహెచ్ఎస్ పద్మశాలిపురం వచ్చినట్లు చెప్పారు. ఈనెలలోనే ఇంగ్లీష్ టీచర్ రిటైర్డ్ అవుతున్నట్లు తెలిపారు. ఈ టీచర్ మ్యూచువల్ బదిలీల్లో వికారాబాద్ దరఖాస్తుచేసుకుని రిలీవ్ అవుతున్నట్లు చెప్పారు. అడ్డదారులు తొక్కిన ఈ టీచర్‌పై చర్యలు తీసుకోవాలని, తగిన ఆధారాలను విద్యాశాఖకు సేవ్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బొడ్డు రవి, రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల మధుకర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలారి సురేష్ కుమార్ సమర్పించినట్లు తెలిపారు. 317 జీవో ద్వారా సుమారు వెయ్యి మంది ఉమ్మడి మహబూబ్‌నగర్ నుంచి తప్పుల తడక సీనియారిటీ జాబితా మొదట పంపి జూనియర్స్ ముందు వచ్చారని, తర్వాత సీనియర్లకు అన్యాయం జరిగిందన్నారు. అక్రమాల కారణంగా జిల్లాలోని ఎక్సెస్ కేడర్ వల్ల నిరుద్యోగ ఉపాధ్యాయులు ఉద్యోగ అవకాశాలు కోల్పోయారని తెలిపారు. స్థానికులకు న్యాయంగా దక్కాల్సిన ఉద్యోగాలను పోరాటం ద్వారా కాపాడుకుంటామని వారు హామీ ఇచ్చారు.

వరంగల్ సభకు భారీగా తరలిరావాలి

డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి



చేవెళ్ల ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న వరంగల్ సభను విజయవంతం చేయాలని ఉమ్మడి డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి కోరారు. శనివారం చేవెళ్లలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. వజ్రోత్సవ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. అన్ని గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించాలన్నారు. సభకు తరలివెళ్లడానికి ఆర్టీసీ బస్సులు, ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు ఉన్నారు.

ప్రతీ ఒక్కరికి సహజంగానే తమ భవిష్యత్ గురించి తెలుసుకోవాలనే ఆతృత, ఆసక్తి ఉంటుంది. గతంలో ఇందుకు చిలుక జ్యోతిషులనే సంప్రదించేవారు. పంజరంలో చిలుకతో జాతకాలు చెబుతామంటూ పల్లెల్లో కనిపించేవారు. అప్పట్లో జాతకాలపై నమ్మకంతో పోటీపడి మరీ చెప్పించుకునేవారు. దాంతో వారికి కడుపునిండా అన్నం మెతుకులు, తిండి గింజలు, జేబునిండా డబ్బులు దొరికేవి. కానీ ప్రస్తుతం పరిస్థితి తారుమారైంది. మార్కెట్‌లోకి హైటెక్ జ్యోతిషులు రావడం.. ప్రజల్లో ఆసక్తి తగ్గడంతో చిలుక జ్యోతిషుల జీవితాలు దుర్భరంగా మారాయి. అటు ఉపాధి దొరక్క, ఇటు జ్యోతిషానికి ఆదరణ లేక అల్లాడుతున్నారు. చిలుక జ్యోతిషుల బతుకు చిత్రంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేకం.



పరిగి మార్కెట్‌లో చిలుక జాతకం చెబుతున్న దృశ్యం

జాతకం

బతుకు చిత్రం

తారుమారు!

కనుమరుగవుతున్న చిలుక జ్యోతిషులు

45 ఏళ్లుగా చిలుకతోనే జీవితం



నా పేరు అరెబేళ్ల జగన్నాథం. బషీరాబాద్ మండలం ఎక్మాయి గ్రామం. పరిగి పట్టణంలో స్థిరపడ్డాం. భార్య నాగమ్మ.. ముగ్గురు మగ, ఇద్దరు ఆడ పిల్లలు. మా తాతముత్తాతల నుంచి చిలుక జాతకం వృత్తినే నమ్ముకుని జీవిస్తున్నాం. నేను కూడా 45 ఏళ్లుగా జాతకాలు చెబుతూ కుటుంబాన్ని వెళ్లదీస్తున్నాను. గతంలో ఏ ఊరికి వెళ్లినా కడుపునిండా అన్నం మెతుకులు, తిండి గింజలు, జేబునిండా డబ్బులు వచ్చేవి. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా తారుమారైంది. ఇప్పుడు ఆదాయం అసలే లేదు. పొద్దస్తమానం తిరిగినా రూ.50 రావడం లేదు. పూటగడవడమే భారంగా మారింది. భార్య కూలి డబ్బులతో పిల్లలను సాకుతున్నాం. ఇప్పటికీ మాకు సొంతిల్లు కూడా లేదు. గుడారం వేసుకొని ఉంటున్నాం. పెద్ద కొడుకు మహేశ్‌బాబు ఆరు వరకు చదివి, వాడు కూడా చిలుకజాతకం వృత్తినే ఎంచుకున్నాడు. చిన్న పిల్లను సర్కారు స్కూల్లో చదివిస్తున్నాను. వేరే పనికి వెళ్లలేక, ఈ వృత్తిని వదులుకోలేక అష్టకష్టాలు పడుతున్నాం.

గతమెంతో ఘనం.. నేడు దుర్భరం

- వృత్తినే నమ్ముకొని సాగిస్తున్న జీవనం
- రోజంతా తిరిగినా పూట గడవని దుస్థితి
- ఉమ్మడి జిల్లాలో సుమారు 400 కుటుంబాలు
- మార్కెట్‌లోకి హైటెక్ ఆస్ట్రాలజర్స్
- నానాటికి ప్రజల్లో తగ్గుతున్న ఆసక్తి
- చిలుక జ్యోతిషుల బతుకు చిత్రంపై ప్రత్యేకం



పరిగి/రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఓ చిలుకా.. రామ చిలుకా.. మీదే జాతకం అంటూ గ్రామాల్లో సంచరించే చిలుక జ్యోతిషుల జీవనం దుర్భరంగా మారింది. ఒకప్పుడు మంచి ప్రాధాన్యతతో పాటు గిట్టుబాటు సంపాదన ఉండేది. అప్పట్లో జనం కూడా చిలుక జాతకంపై నమ్మకంతో ఉండేవారు. పంజరంలో చిలుకను పెట్టుకొని తిరుగుతూ వాటిచేత బొమ్మల కాగితాలు తీయించి ప్రజలకు భవిష్యత్తు గురించి చెప్పేవారు. వచ్చే కాసింత డబ్బుతో కుటుంబాలను వెళ్లదీసేవారు. ఏ గ్రామానికెళ్లినా జనం పోటీపడి జాతకం చెప్పించుకునేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. మార్కెట్‌లోకి హైటెక్ జ్యోతిషులు రావడంతో చిలుక జ్యోతిషం చెప్పేవారికి ఆదరణ పూర్తిగా తగ్గింది. అయితే ఈ వృత్తిని వదులుకోలేక, మరో వృత్తిని ఎంచుకోలేని అనేక కుటుంబాలు పూటకు

మిగతా 7వ పేజీలో...

సమాచారం

దరఖాస్తుల ఆహ్వానం

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ డయోగ్నొస్టిక్ ఉద్యోగాల భర్తీకి అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో తెలంగాణ డయోగ్నొస్టిక్-నేషనల్ హెల్త్ మిషన్ పథకంలో భాగంగా జిల్లా లేబరేటరీ హబ్‌లో కాంట్రాక్ట్ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చెప్పారు. అభ్యర్థులు విద్యార్హత, బయోడేటా, 500 రూపాయలతో కూడిన డీడీ(రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పేరున) జత చేసి పోస్టు ద్వారా, లేదా నేరుగా పిల్లర్ నంబరు 294, శివరాంపల్లిలోని జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు



వాక్ ఇన్ ఇంటర్వ్యూ

మెడికల్ ఆఫీసర్ పోస్టులకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని యూపీహెచ్‌సీ/బస్తీ దవాఖానాలోని 12మెడికల్ ఆఫీసర్ పోస్టులకు అర్హత కలిగిన ఎంబీబీఎస్ అభ్యర్థులకు ఈనెల 29వ తేదీ ఉదయం 10.30గంటలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ కాపీలతో శివరాంపల్లిలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో హాజరు కావాలని ఆయన తెలిపారు.

బీజేపీ విధానాలు రాజ్యాంగ విరుద్ధం



- పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్
- చింతలపల్లిలో జై సంవిధాన్ పాదయాత్ర

14

మురికి కూపం.. ఉప్పరాశి కుంట

జలాశయంలోకి డ్రైనేజీ వాటర్

- దుర్గంధంతో ఇబ్బందుల్లో ప్రజలు
- ఆక్రమణలను పట్టించుకోని అధికారులు
- ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో నిర్మాణాలు
- సుందరీకరణ.. శంకుస్థాపనకే పరిమితం



కడ్తాల్ ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కడ్తాల మండల కేంద్రంలోని ఉప్పరాశి కుంట చెరువు మురికి కూపంగా మారింది. ఒకవైపు కోట్ల రూపాయల విలువైన భూమిని కబ్జా చేస్తుండటంతో కుంట కుచించుకుపోతుండగా... మరోవైపు మురుగునీటిని వదులుతుండటంతో చెరువు దుర్గంధభరితంగా మారింది. భూగర్భ జలాల పెంపునకు దోహదపడే చెరువును ఊరి నుంచి వెలువడే మురుగునీటితో నింపేస్తున్నారు. డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసుకోకుండా పంచాయతీ మురుగునీటిని చెరువులోకి మళ్లిస్తున్నారు. దీంతో ఉప్పరాశి కుంట కాలుష్యమయంగా మారింది. దుర్గంధం వెదజల్లుతుండటంతో చుట్టు పక్కల నివాసం ఉండే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకప్పుడు ఈ చెరువు స్వచ్ఛమైన నీటితో కళకళలాడేది. ప్రస్తుతం కలుషిత నీటితో చేపలు కూడా బతికే పరిస్థితి లేక మత్స్యకారులు ఉపాధి కోల్పోయారు. ఆక్రమణలు అడ్డుకొని, కలుషిత నీరు చేరకుండా చూడాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోగా, కొందరు నేతలు ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమంగా నిర్మాణాలు, వెంచర్లు ఏర్పాటు చేసి లక్షలు దండుకుంటుండటం విమర్శలకు తావిస్తోంది.

కుంట విస్తీర్ణం 14.25 ఎకరాలు

కడ్తాల మండల కేంద్రంలో హైదరాబాద్ - శ్రీశైలం జాతీయ రహదారి పక్కన

మిగతా 8వ పేజీలో...

కుంటను కాపాడాలి



మురుగు నీటితో ఉప్పరాశి కుంట చెరువులో నీరు పూర్తిగా కలుషితమైంది. కడ్తాల గ్రామ పంచాయతీ పరిధిలోని నివాస గృహాల నుంచి వెలువడే మురుగు నీరు చెరువులోకి చేరకుండా చర్యలు తీసుకోవాలి. ప్రత్యేక డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. చెరువు భూమి ఆక్రమణలకు గురి కాకుండా రక్షణ కంచెను ఏర్పాటు చేయాలి. ఆక్రమణల తొలగింపు, కుంట పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి.

- జహంగీర్‌బాబా, కడ్తాల్

సాఫీగా ఫార్మా భూముల సర్వే

యాచారం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీ కోసం గతంలో తీసుకున్న భూముల సర్వే సాఫీగా సాగుతోంది. కోర్టు వివాదంలో ఉన్న భూములను వదిలిపెట్టి మిగతా వాటిని అధికారులు సర్వే చేసి హద్దులు గుర్తిస్తున్నారు. ఆ వెంటనే ఐరన్ కడీలను బిగిస్తున్నారు. శనివారం రెండు కిలోమీటర్ల మేర కడీల బిగింపు పనులు చేపట్టారు. రెండు నెలల వ్యవధిలో ఫెన్సింగ్ పూర్తి చేయడానికి ఆదివారం కూడా కూలీల చేత పనులు చేయించారు. కాగా సర్వే సందర్భంగా నలుగురు సీఐలు, ఏసీపీ, అదనపు డీసీపీలు పరిస్థితిని సమీక్షించారు.



తాటిపర్తి గుట్టల్లో భూసర్వే చేస్తున్న రెవెన్యూ, టీజీఐఐసీ అధికారులు



నందిగామలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

'భూ భారతి'తో సమస్యల పరిష్కారం

కలెక్టర్ నారాయణరెడ్డి

నందిగామ, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భూ భారతి ఆర్‌వోఆర్ చట్టం ద్వారా భూముల వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. నందిగామ మండల కేంద్రంలో శనివారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ రైతులకు భూములపై పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ఈ చట్టం దోహదపడుతుందన్నారు. అంతేకాకుండా తహసీల్దార్, ఆర్డీవో స్థాయిలో భూ సమస్యలను పరిష్కరించుకోవచ్చని సూచించారు. మే నెల మొదటి వారంలో ప్రతీ గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూసమస్యలపై దరఖాస్తులు స్వీకరించి అధికారులు పరిష్కరిస్తారని పేర్కొన్నారు. న్యాయం జరగడం లేదని భావిస్తే కలెక్టర్‌కు అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. భూములకు సంబంధించి పూర్తి వివరాలతో భూధార్ కార్డులను కేటాయిస్తుందని తెలిపారు.

ధరణి పేరుతో దగా: ఎమ్మెల్యే వీర్లపల్లి

గత బీఆర్ఎస్ పాలకులు ధరణి పేరుతో రైతులను దగా చేశారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. కొందరు వందల

మిగతా 8వ పేజీలో...



పల్లెదారుల్లో పచ్చదనం

యాచారం మండలంలోని నందివనపర్తి నుంచి ఏనెకిందితండా వెళ్లే రోడ్డుకు ఇరువైపులా కిలోమీటరున్నర మేర పచ్చని చెట్లు కనువిందు చేస్తున్నాయి. ఎనిమిదేళ్ల క్రితం హరితహారం కింద నాటిన మొక్కలు.. నేడు ఏపుగా పెరిగి పచ్చదనాన్ని పంచుతున్నాయి. ఎర్రటి ఎండలో కూడా ఆ మార్గంలో వెళ్లే ప్రయాణికులకు నీడనిస్తూ ఆహ్లాదాన్ని అందిస్తున్నాయి.

యాచారం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి)



కూల్చివేసిన చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలిస్తున్న నర్సింహ తదితరులు

చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని పునరుద్ధరించాలి

మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహ

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం చెరువుకట్ట కింద ఉన్న చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని కూల్చివేయడం సరికాదని మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహ అన్నారు. శనివారం కూల్చివేసిన చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించి ఆందోళన వ్యక్తం చేశారు. చెరువు కట్ట కింద గతంలో తొమ్మిది ట్యాంకులు నిర్మించి కొన్నేళ్లపాటు చేప పిల్లలను ఉత్పత్తి చేశారని గుర్తు చేశారు. అప్పట్లో మత్స్యకార సొసైటీలకు ఇక్కడ ఉత్పత్తి చేసిన చేప పిల్లలను సరఫరా చేసేవారని, అలాంటిది అధికారులు ఏకపక్షంగా ఈ ట్యాంకులను కూల్చివేయడంలో అర్థం లేదన్నారు. తిరిగి ఈ ట్యాంకులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు చెనమోని శంకర్, జంగయ్య, వీరేష్, యాదగిరి తదితరులున్నారు.

భారత్ సమ్మిట్‌లో ఎంపీ, ఎమ్మెల్యే



ఆమనగల్లు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ హెచ్‌సీఐలో జరుగుతున్న భారత్ సమ్మిట్-2025లో శనివారం నాగర్‌కర్నూల్ ఎంపీ సభ్యుడు మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కల్పిస్తున్న అవకాశాలతో అనేక విదేశీ సంస్థలు పెట్టుబడులకు ముందుకొస్తున్నాయని రవి అన్నారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికాంత్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ఫేక్ నంబర్ ప్లేట్‌తో నిలువు దోపిడీ

- షాద్‌నగర్ వ్యక్తి కారు నంబర్‌ను బైక్‌కు వేసుకొని చోరీలు
- అడ్డా కూలీల మహిళలే టార్గెట్ చేసుకున్న దుండగుడు
- పోలీసులకు సవాల్‌గా వరుస దొంగతనాలు

షాద్‌నగర్ రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి కారు నంబర్‌ను బైక్‌కు తగిలించుకొని ఓ దుండగుడు చోరీలకు పాల్పడుతున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. షాద్‌నగర్ శివారు మరియా రాణి పాఠశాల పక్కన శ్రీనివాసులు నివాసం ఉంటున్నాడు. కొంత కాలం కింద కారు కొన్నాడు. ఆ కారు నంబర్ టీఎస్07 హెచ్‌జడ్0247. ఇదే నంబర్‌ను ఓ దుండగుడు బైక్‌కు పెట్టుకుని కూలీ అడ్డాల వద్ద ఉండే మహిళలను పనిఉందని బైక్ ఎక్కించుకొని నిర్మానుష్య ప్రదేశాలకు తీసుకెళ్లి ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను దోచుకుంటున్నాడు. కొందరి చెవి కమ్మలను లాక్కోగా వారికి గాయాలయ్యాయి. ఈ దుండగుడు ఇప్పటి వరకు జడ్చర్ల, సిద్దిపేట, చేవెళ్ల, నల్లగొండ జిల్లాల్లో నిలువు దోపిడీలకు పాల్పడినట్లు తేలింది. బైక్ నంబర్ ఆధారంగా మూడు రోజుల కింద సిద్దిపేట పోలీసులు షాద్‌నగరొచ్చి కారుయజమానిని ప్రశ్నించారు. ఆ నంబరున్న బైక్ తనది కాదని శ్రీనివాసులు పోలీసులతో వాపోయాడు. దొంగ బైక్‌కు తన కారు నంబర్ ఉండడంతో వివిధ జిల్లాల పోలీసులు తన ఇంటికొస్తున్నారని, చేయని తప్పునకు పోలీసు విచారణతో తనకు ఇబ్బందికరంగా ఉందని శ్రీనివాస్ వాపోయాడు. దీనిపై షాద్‌నగర్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. వాహనాల మారు నంబర్ ప్లేట్లతో చోరీలు జర గడం ఈ ప్రాంతంలో ఇదే కొత్త అన్నారు. చోరీపై సిద్దిపేట పోలీసులు తమకు సమాచారమిచ్చారని చెప్పారు. షాద్‌నగర్‌లో కూలీల అడ్డాలు, ఇతర చోట్ల నిఘాపెట్టామని చెప్పారు.



మహిళను బైక్‌పై తీసుకెళ్తున్న నిందితుడు(ఫైల్)



చెవి కమ్మలు లాక్కున్నాడని చూపుతూ రోదిస్తున్న మహిళ



నిందితుడు వాడుతున్న బైక్ నంబర్

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలి



కడ్తాల్‌లో సర్వేను పరిశీలిస్తున్న సీఈవో కృష్ణారెడ్డి

ఆమనగల్లు/కడ్తాల, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి అన్నారు. అధికారులు నిబంధనల మేరకే నడుచుకోవాలని సూచించారు. ఆమనగల్లు మండలం గౌరారం, కడ్తాలలో శనివారం సీఈవో పర్యటించారు. ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక తీరును పరిశీలించారు. సర్వే ఫారాల్లో వివరాలను సమగ్రంగా పొందుపర్చాలన్నారు. ఇందిరమ్మ కమిటీల జాబితా ఆధారంగా నిర్వహిస్తున్న సర్వేలో పొరపాట్లకు తావివ్వొద్దని చెప్పారు. అర్హులకే ఇళ్లు కేటాయించాలన్నారు. సర్వే వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు మాధురి, సుజాత, ఎంపీవోలు లాలయ్య, వినోద, పంచాయతీ కార్యదర్శులు అల్లాజి తదితరులు పాల్గొన్నారు. అలాగే కడ్తాల్ మండల ముద్విన్‌లో సర్వేను స్పెషలాఫీసర్ మహేందర్‌రెడ్డి, పీఎస్ జగదీశ్ పరిశీలించారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి దరఖాస్తుదారుల వివరాలు సేకరించారు. కార్యక్రమంలో నాయకులు నరేశ్, యాదయ్య, శ్రీశైలం, నర్సిరెడ్డి,వెంకటయ్య, నర్సింహ, మల్లేశ్, సురేందర్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి, ఆనంద్, వెంకటేశ్ పాల్గొన్నారు.

29న సామాజిక తనిఖీ ప్రజావేదిక

తలకొండపల్లి, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి):మండల పరిషత్ వద్ద ఈ నెల 29న ఉపాధి హామీ పథకం మండల ప్రజావేదిక నిర్వహిస్తామని ఎంపీడీవో శ్రీకాంత్ తెలిపారు. 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు చేసిన పనులపై తనిఖీ 14వ విడత కార్యక్రమం ఈ నెల 12 నుంచి 25వ తేదీ వరకు చేశామన్నారు. చేపట్టిన పనులు, నిధుల ఖర్చు, సామాజిక తనిఖీ నివేదికను బహిరంగ ప్రజావేదికలో అందజేస్తామన్నారు. అధికారులు, కూలీలు, కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


జె.జంగయ్య(ఫైల్)

పూడూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. ఈ ఘటన పూడూరు మండలంలోని కడుమూరు గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కడుమూరు గ్రామానికి చెందిన జొన్నాడ జంగయ్య(40) మధ్యాహ్నం 2గంటల సమయంలో తన పొలం వద్ద ఉన్న బోరు మోటారును ఆన్ చేసేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు స్టార్టర్ వైర్ తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. జంగయ్యకు ఇద్దరు కుమారులు ఉన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న రామకృష్ణ

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ఆమగల్లు/కడ్తాల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఈజీఎస్ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సెంట్రల్ క్వాలిటీ కంట్రోల్ సభ్యుడు రామకృష్ణ అధికారులకు సూచించారు. శనివారం ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో పర్యటించారు. ఆయా మండల పరిషత్‌లలో ఈజీఎస్ రికార్డులను పరిశీలించారు. అనంతరం సింగంపల్లి ఊరగుట్టలో ప్లాంటేషన్ పనులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీవోలు సుజాత, మాధురి, చేవెళ్ల ఏపీడీ చరణ్‌గౌతమ్, డీఆర్‌డీఏ అధికారి శ్వేత, సునీత, ఏపీవోలు తదితరులు ఉన్నారు.


ఈవోకు వినతిపత్రం ఇస్తున్న కౌలు రైతులు

ఆలయ భూములకు కౌలు ఇవ్వలేం

యాచారం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రైతులకు 37ఎ టెనెంట్ చట్టం ఉండగా కౌలు ఇవ్వాలని బలవంతపెట్టొద్దని, తాము కౌలు ఇవ్వలేమని ఆలయ భూమి సాగు చేసుకుంటున్న నందివనపర్తి, నజ్దిక్‌సింగారం, కుర్మిద్ద, తాటిపర్తి రైతులు అన్నారు. శనివారం నందివనపర్తిలో ఓంకారేశ్వరాలయ ఆలయ ఈవో శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇచ్చారు. టెనెంట్ హక్కు ఉండగా కౌలు ఎందుకివ్వాలో అధికారులు సమాధానం చెప్పాలన్నారు. కౌలు విషయంలో తాము కోర్టులో కేసు పెట్టామని పేర్కొన్నారు. కౌలు చెల్లించాలని దండోరా వేయించడం సరికాదన్నారు. రైతులు చెన్నయ్య, బుగ్గరాములు, యాదయ్య, జంగయ్య తదితరులు ఉన్నారు.


మహిళతో మాట్లాడుతున్న బాబయ్య

కేంద్ర నిధులతోనే గ్రామాల అభివృద్ధి

షాద్‌నగర్ రూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కేంద్రం నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నారని బీజేపీ షాద్‌నగర్ ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య తెలిపారు. 'గావ్ చలో-బస్తీ చలో..' కార్యక్రమంలో భాగంగా శనివారం ఫరూఖ్‌నగర్ మండలం ఎల్లంపల్లిని నాయకులతో కలిసి సందర్శించారు. ఆయన మాట్లాడుతూ మోదీ దేశానికి సుస్థిరపాలన అందిస్తున్నారన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో సందర్శించి అందిస్తున్న పౌష్టికాహారంపై తెలుసుకున్నారు. కార్యక్రమంలో కె.వెంకటేష్‌గుప్తా, కుర్మయ్య, రాజు, అజయ్, సురేశ్ పాల్గొన్నారు.


తవ్వకాలను పరిశీలిస్తున్న అధికారులు సత్యనారాయణ, నిర్మల, నాగరాజు

అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు

తాండూరురూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధి మల్కాపూర్‌లో నాపరాతి గనుల్లో అక్రమంగా తవ్వకాలు చేసేవారిపై కఠిన చర్యలు తప్పవని తాండూరు మైన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ సత్యనారాయణ హెచ్చరించారు. శనివారం మల్కాపూర్‌లో సర్వే నంబర్-75లో మంచన్పల్లి ఎల్లమ్మ భూమిలో రాములు నాపరాతి తవ్వకాలు జరుపుతున్నారని ఫిర్యాదు చేశారు. దీంతో ఏడీ, అసిస్టెంట్ జియాలజిస్ట్ నాగరాజు బృందం తనిఖీ నిర్వహించింది. నాపరాతి గనికి తీసుకున్న విద్యుత్ కనెక్షన్ కట్ చేయించారు. దీనిపై వివరాలు సేకరించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఏడీ చెప్పారు.



జాతకం తారుమారు!

(ఐదో పేజీ తరువాయి)

మెతుకులు పుట్టని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రస్తుతం జనాలు చిలుక జాతకాలను మరచిపోతున్న పరిస్థితి. ఇప్పుడున్న పరిస్థితుల తగ్గట్లు హైటెక్ జ్యోతిషులు అందలమెక్కుతుంటే, నాటి నుంచి నేటి వరకు చిలుకనే నమ్ముకున్న జ్యోతిష్యుడి బతుకులు అంధకారంలో మగ్గుతున్నాయి.

సుమారు 400 కుటుంబాలు...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 400 చిలుక జ్యోతిషుల కుటుంబాలున్నాయి. వికారాబాద్ జిల్లాలో దాదాపుగా వందకుపైగా ఉన్నాయి. పరిగి, తాండూరు, బషీరాబాద్, కొడంగల్, వికారాబాద్ ప్రాంతాల్లో చిలుక జ్యోతిషులు జీవనం కొనసాగిస్తున్నారు. అలాగే రంగారెడ్డి జిల్లాలో సుమారు 250 నుంచి 300 కుటుంబాలు ఉన్నాయి. జహీరాబాద్, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి వచ్చి శంషాబాద్, శంకర్‌పల్లి, షాబాద్, మొయినాబాద్ నియోజకవర్గాల్లో వారు స్థిరపడ్డారు. అలాగే మేడ్చల్ జిల్లాలోని కీసరలో 8 కుటుంబాలు ఉన్నాయి. వీరంతా పట్టణ ప్రాంతాల్లో నివసిస్తూ నిత్యం గ్రామాల్లోకి వెళ్తున్నారు. పరిగి పట్టణంలోని మార్కెట్ యార్డులో నిత్యం చిలుకతో జోతిషం చెబుతూ కనిపిస్తున్నారు. చిలుకలతో చుట్టుపక్కల గ్రామాలు తిరుగుతూ జ్యోతిషం చెబుతూ వచ్చే కాసిన్ని డబ్బులతో పూటగడుపుతున్నారు. ప్రజల్లో నానాటికీ చిలుక జోతిషంపై ఆసక్తి తగ్గుతుండటంతో వారి జీవితాలు దుర్భరంగా మారుతున్నాయి.

పూట గడవడం కష్టంగా ఉంది



పాలమూరు జిల్లా నుంచి పరిగికి వచ్చాను. 40 ఏళ్లుగా చిలుక జాతకంతోనే కుటుంబాన్ని పోషిస్తున్నాను. ఇప్పుడు రోజంతా కూర్చుంటే వంద రూపాయలు రావడం లేదు. ప్రస్తుతం చిలుక జ్యోతిషం చూపించుకునేందుకు ఎవరూ రావడం లేదు. ఒక్కొక్కరికి ఐదు రూపాయలకు జాతకం చెప్పినా రోజుకు యాభై రూపాయలు కూడా రావడం లేదు. భార్య, పిల్లలను పోషించలేకపోతున్నా. ఒక్కోసారి ఖాళీ కడుపుతో ఉండాల్సిన పరిస్థితి. ప్రభుత్వం మాకు ఉపాధి కల్పించి ఆదుకోవాలి.

- శేఖర్, చిలుక జ్యోతిషుడు, పరిగి

కూలి పనికి కూడా పిలువడం లేదు



జ్యోతిషం చెప్పేందుకు వారానికోసారి పరిగి సంతకు వస్తాను. మా నాన్న బలవంతంతో చిలక జాతకం చెప్పడం వృత్తిగా చేసుకున్న. రోజంతా తిరిగితే రెండు వందలు కూడా రావడం లేదు. అయితే గ్రామాలకు తిగిరితే సగం డబ్బులు చార్జీలకే అవుతున్నాయి. కొన్నాళ్లు కూలి పని చేశాను. కొందరు అయితే చిలుక జ్యోతిష్యుడని పనికి వద్దంటున్నారు. చేసేదేమి లేక జ్యోతిషాన్నే నమ్ముకున్న. ప్రభుత్వం మా కుటుంబాలను ఆదుకోవాలి.

- శ్రీనివాస్, చిలుక జ్యోతిషుడు, పరిగి

బట్టల వ్యాపారం చేసుకుంటున్నా...



మా తాత జెతింగ్‌రావు, నా తండ్రి తుకారామ్ చిలక పంచాంగం చెప్పి కుటుంబాన్ని పోషించేవారు. మా పెద్దల మరణంతోనే జ్యోతిష్యం లేకుండా పోయింది. నేను సుమారు 15 ఏళ్లుగా శంకర్‌పల్లిలోని బట్టల దుకాణంలో పనిచేశాను. ప్రస్తుతం సొంతంగా వ్యాపారం చేసుకుంటున్నాను. దాంతో పాటుగా రియల్ ఎస్టేట్ చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాను.

-భిక్షపతి, శంకర్‌పల్లి మున్సిపాలిటీ

గుణాత్మక విలువలతోనే వికసిత్ భారత్


విశ్వవిశ్వాని సదస్సులో ప్రసంగిస్తున్న సుధాకర్‌రెడ్డి

శామీర్‌పేట, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ లక్ష్యం సాకారం కావాలంటే గుణాత్మక విలువలతో కూడిన యువ నిపుణులు, విద్యార్థులు చేయూతనివ్వాలని ఐసీఎస్ఎస్ఆర్-ఎస్ఆర్‌సీ ప్రొఫెసర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం తూంకుంటలోని విశ్వవిశ్వాని మేనేజ్‌మెంట్ కాలేజీలో చైర్మన్ శ్రీనివాసచార్య ఆధ్వర్యంలో 'వికసిత్ భారత్-5.0' అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహించారు. శనివారం ముగింపు కార్యక్రమానికి సుధాకర్‌రెడ్డి హాజరయ్యారు. కీలకాంశంపై జాతీయ సదస్సు నిర్వహించిన కళాశాల యాజమాన్యాన్ని ప్రశంసించారు. దేశం 5.0 వ్యూహాల్లో అనుసంధానం, వనరుల సద్వినియోగంతో గొప్ప పరిణతి సాధించిందన్నారు. నూతన ఆవిష్కరణలు, స్మార్ట్ సిటీల వృద్ధిపై ప్రదర్శనలకు ఇలాంటి సదస్సులు ఉపయోగపడుతాయన్నారు. డిజిటల్ ఆవిష్కరణల్లో యువ నిపుణుల, విద్యార్థుల పాత్ర ముఖ్యమన్నారు. వీవీ విద్యా సంస్థల చైర్మన్ శ్రీనివాసచార్య, అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, డైరెక్టర్ శ్రీరామకృష్ణ మాట్లాడుతూ.. ప్రపంచ సహకారం పెంపు, ఆవిష్కరణల ప్రోత్సాహానికి ఈ సదస్సు దోహదపడుతుందన్నారు. విశ్వవిశ్వాని అధ్యాపకులు రచించిన పుస్తకాలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీవీ కాలేజీల కన్వీనర్లు మదన్మోహన్, జాబెజ్, చక్రవర్తి, ఇర్ఫాన్, ప్రిన్సిపాల్ శ్రీకాంత్, అధ్యాపకులు పాల్గొన్నారు.

తులం బంగారం ఎప్పుడిస్తారు?


ప్రవీణ్‌కుమార్‌ను సత్కరించిన బీజేపీ నాయకులు

యాచారం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ నాయకులు ప్రజలను మోసం చేశారని, ఎన్నికల్లో ఇచ్చిన గ్యారంటీలను అటకెక్కించారని బీజేపీ రాష్ట్ర నాయకుడు చికోటి ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. శనివారం యాచారంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రవీణ్‌కుమార్-మాధురిప్రియదర్శి దంపతులు పూజలు చేశారు. అనంతరం బీజేపీ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కల్యాణలక్ష్మి పథకం కింద ఇప్పుడిస్తున్న లక్షకు అదనంగా తులం బంగారం ఇస్తామని ప్రతీ ఎన్నికల సభల్లో రేవంత్‌రెడ్డి చెప్పారని, ఇప్పుడు దానిని అమలు చేయడం లేదన్నారు. మరి బంగారం ఇస్తరా, ఇయ్యరా అనేది పాలకులే ప్రకటించాలని డిమాండ్ చేశారు. వంటగ్యాస్ రాయితీ ఎవరికీ అందడం లేదన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు చీకటి మిత్రుల్లా ఉన్నాయని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన అవినీతిని ప్రస్తుత ప్రభుత్వం ఎందుకు వెలికితీయడం లేదని ప్రశ్నించారు. నిరుపేదలకు సంక్షేమ పథకాలను అందించేందుకు ప్రధానమంత్రి శ్రమిస్తున్నారన్నారు. ఆయనతో నాయకులు కొప్పు బాషా, తాండ్ర రవీందర్, కృష్ణ, రమేశ్, నాగరాజు, శ్రీనివాస్‌గుప్తా, అల్వాల్‌రెడ్డి ఉన్నారు.

మతోన్మాదాన్ని అణచివేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న విజయలక్ష్మీ పండిట్

తాండూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మతోన్మాదాన్ని అణచివేయకపోతే ఉగ్రవాదం పెట్రేగుతుందని సీపీఐ వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మీ పండిట్ అన్నారు. ఉగ్రవాదం, మతోన్మాదం ఏ రూపంలో ఉన్నా అణచివేయాలని డిమాండ్ చేశారు. శనివారం తాండూరులో జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని ఎం.వెంకటేశ్ అధ్యక్షతన నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని మార్చాలని, పాత చట్టంలో ఎక్కువ జోక్యం అనవసరమని అభిప్రాయపడ్డారు. ప్రజాసమస్యలపై పోరాటాలు చేయాలని, సభ్యత్వాలు చేపట్టాలని సూచించారు. పహల్గాంలో ప్రజల ప్రాణాలను బలిగొన్న ఉగ్రవాదులను తుదముట్టించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్‌లు పీర్‌మహ్మద్, వెంకటేష్, సురేష్, చంద్రయ్య, మునీర్, బషీర్, నర్సింహాబేగం, జగదాంబ, రాజు, మహమూద్, తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనల్లో నాణ్యతకు ప్రాధాన్యం


మాట్లాడుతున్న నీలిమ

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్య పరిశోధనలకు బలం చేకూర్చేలా తెలంగాణ ముందడుగు వేసిందని అనురాగ్ యూనివర్సిటీ ఈసీవో సూర్యదేవర నీలిమ అన్నారు. వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో శనివారం 'అనుదాబన్-2025' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. నాణ్యమైన పరిశోధనలకు తమ యూనివర్సిటీ వేదిక అయిందని గుర్తుచేశారు. భారత్, సింగపూర్, నెదర్లాండ్స్, జోర్డాన్ దేశాల అధ్యాపకులు కార్యక్రమంలో భాగస్వాములయ్యారని తెలిపారు. కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ డీన్‌లు బాలాజీ, విష్ణుమూర్తి, వసుధభక్షి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

మునివాహన ఉత్సవాలు చేస్తున్నందుకే దాడి

- దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం
- చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధానార్చకులు రంగరాజన్


మాట్లాడుతున్న అర్చకులు రంగరాజన్

పంజాగుట్ట, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): దళితులను భుజంపై ఎక్కించుకొని ఆలయంలోకి ప్రవేశింపజేసే మునివాహన ఉత్సవాలను చేస్తున్నందుకే తనపై దాడి చేశారని చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు సీఎస్.రంగరాజన్ చెప్పారు. తనపై దాడి చేయడమే కాక అసత్య ఆరోపణలు చేస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటానన్నారు. పరువు నష్టం దావా వేస్తానన్నారు. శనివారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జాతీయ ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మారేడు మోహన్, నగర ప్రధాన కార్యదర్శి కె.అర్వింద్‌కుమార్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 7న తన ఇంటిపైకి 20మందికిపైగా వచ్చి దాడికి పాల్పడ్డారని తెలిపారు. రామరాజ్యం కోసం ఏం పనిచేస్తున్నావని ప్రశ్నిస్తూ తన భుజంపై నామాలు ఉన్న చోట తన్నారని చెప్పారు. ఉగాదిలోగా సైన్యాన్ని నిర్మించడమేకాక, వనరులు ఏర్పాటు చేయాలని బెదిరించారని గుర్తుచేశారు. తమ టార్గెట్ చినజీయర్ స్వామి అంటూ వెళ్లిపోయారని రంగరాజన్ వివరించారు.


ఆటో ఎక్స్‌పో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

నవీన పద్ధతులతో అవకాశాలను పెంపొందించాలి

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): నవీన విధానాలతో అవకాశాలు పెంపొందించాలని జెన్‌టీయుహెచ్ మాజీ వీసీ రాజగోపాల్ అన్నారు. ఘనాపూర్‌లోని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం 'ఎక్స్‌పర్ట్ టాక్' కార్యక్రమం జరిగింది. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. విద్యార్థులు నవీన పద్ధతులతో ఉద్యోగావకాశాలను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమానంతరం ఆటో ఎక్స్‌పో- 2025 పోస్టర్‌ను ఆవిష్కరించారు. డైరెక్టర్ సుధీర్ ప్రేమ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీరబ్రహ్మం

నూతన పరిశోధనలు రూపొందించాలి

కీసర, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): సాంకేతికశాస్త్రంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు నూతన పరిశోధనలకు రూపకల్పన చేయాలని సైంటిస్ట్ వీర బ్రహ్మం అన్నారు. భోగారంలోని హోలీమేరీ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌పై అంతర్జాతీయ సదస్సు-2025 శనివారంతో ముగిసింది. ముఖ్య అతిథి వీరబ్రహ్మం మాట్లాడుతూ.. టెక్నాలజీ పరంగా భవిష్యత్తు మొత్తం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)దే అన్నారు. విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో పలు రాష్ట్రాల విద్యార్థులు 1,400 పరిశోధనల థీసిస్‌ను సమర్పించారు. వాటిల్లో 370 పత్రాలను పలు కంపెనీలు ఆమోదించాయి. అనంతరం విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఎ.సిదార్థ రెడ్డి, డి.కృష్ణారెడ్డి, సుబ్రహ్మణ్యం, జీవన్‌కూమార్ పాల్గొన్నారు.

బీజేపీ విధానాలు రాజ్యాంగానికి విరుద్ధం


పాదయాత్రలో పాల్గొన్న శ్రీనివాస్‌గౌడ్, నర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): దేశంలో మతతత్వ శక్తులు రాజ్యాంగాన్ని, మహనీయులను అవమానించేలా వ్యాఖ్యానిస్తూ చేస్తూ రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కల్గిస్తున్నాయని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ అన్నారు. ఆమనగల్లు మండలం చింతలపల్లిలో శనివారం జై బాపు.. జైభీమ్.. జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్ నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. గడప గడపకు తిరిగి రాజ్యాంగం, మహనీయుల ఆశయాలు, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలపై వివరించారు. రాజ్యాంగ పరిరక్షణపై నాయకులు, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. మత రాజకీయాలతో బీజేపీ దేశ విచ్ఛిన్నానికి పాల్పడుతోందన్నారు. స్వేచ్ఛ, సమానత్వం కాంగ్రెస్ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో నాయకులు ధనుంజయ్య, మల్లె జగన్, శంకర్, షాబుద్దీన్, వస్పుల శ్రీకాంత్, ఫరీద్, కృష్ణానాయక్, శ్రీశైలం, ఖాదర్, జంగయ్య, బాల్‌రెడ్డి, సుదర్శన్, యాదయ్య, చంద్రయ్య, సాయిలు, కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, రంగారెడ్డి, రాజు, నర్సింహ, మహేశ్, విజేందర్, అలీం, వెంకట్‌రెడ్డి, నాజర్, ఖాద్రి, మైసయ్య, మల్లయ్య, అంజన్‌రెడ్డి, వెంకటేశ్, మానయ్య, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒడిశా బీచ్‌లో కేసీఆర్ సైకత శిల్పం

బీఆర్ఎస్ 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సైకత శిల్పాన్ని ఒడిశా గోల్డెన్ బీచ్‌లో మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఎన్.నవీన్‌కుమార్‌రెడ్డి వేయించారు. కేసీఆర్ విశిష్టతను, బీఆర్ఎస్ ప్రస్థానాన్ని వ్యాపింపజేసేందుకే తాను ఇసుకతో ఈ కళారూపాన్ని చేయించానన్నారు. 'కేసీఆర్.. మా కోసం నువ్వు నిలబడ్డావు.. మీ కోసం మేం నిలబడతాం.' ఈ సైకత శిల్ప సారాంశమని నవీన్‌కుమార్‌రెడ్డి శనివారం తెలిపారు.

- షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి)



ఆంధ్రజ్యోతి విజేతలకు బహుమతుల అందజేత


విజేతలకు కన్సోలేషన్ బహుమతులను అందజేస్తున్న జర్నలిస్టులు, సర్క్యులేషన్ సిబ్బంది

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి దినపత్రిక పాఠకుల కోసం నిర్వహించిన కార్ అండ్ బైక్ రేస్ పోటీలో పాల్గొన్న వారికి కన్సోలేషన్ బహుమతులను శనివారం ప్రదానం చేశారు. ఈ పోటీల్లో షాద్‌నగర్ డివిజన్ పరిధి కేశంపేటకు చెందిన కె.వెంకటేశ్, బుచ్చిగూడెంకు చెందిన ఇ.నవీన్‌రెడ్డి, కొత్తూర్‌కు చెందిన జి. శ్రీదేవి, షాద్‌నగర్‌కు చెందిన డి.భరత్‌లకు ప్రత్యేక బహుమతులు గెలుచుకున్నారు. వీరికి షాద్‌నగర్‌లోని ఆంధ్రజ్యోతి కార్యాలయంలో బహుమతులను అందజేసి అభినందించారు. పిలిచి బహుమతులిచ్చిన ఆంధ్రజ్యోతి యాజమాన్యానికి, సిబ్బందికి విజేతలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి జర్నలిస్టులు టి.సంజయ్‌కుమార్, ఎల్.మోహన్‌రెడ్డి, వైశేఖర్‌యాదవ్, ఏసీవో ఆశోక్, ఎస్ఆర్.శివకుమార్ పాల్గొన్నారు.

వడగండ్ల బాధితులను ఆదుకుంటాం



- యాచారం మండల వ్యవసాయాధికారి రవినాథ్

ఫటాఫట్

యాచారం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలో కురిసిన వడగండ్ల వర్షం ద్వారా జరిగిన నష్టాన్ని అంచనావేసి జిల్లా వ్యవసాయాధికారులకు పంపుతామని, నష్టపోయిన రైతులను ఆదుకుంటామని మండల వ్యవసాయాధికారి రవినాథ్ తెలిపారు. ఈ విషయంలో అన్నదాతలు ఆందోళన చెందరాదని చెప్పారు. ఈమేరకు ఆయన పలు విషయాలు 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

ప్రశ్న : ఇటీవల వడగండ్ల వానకు ఎంతమేర పంట నష్టం వాటిల్లింది? వివరాలను జిల్లా అధికారులకు నివేదించారా?

జవాబు : మండలంలో కురిసిన వడగండ్ల వానతో 200 ఎకరాల్లో వరి పంట పాడైంది. మరో 35 ఎకరాల్లో మామిడితోటలు, కూరగాయలకు పంటనష్టం వాటిల్లింది. వివరాలను జిల్లా అధికారులకు పంపించాం.

ప్రశ్న : వానాకాలంలో ఎన్ని ఎకరాలలో పంట సాగు అంచనా వేశారు?

జవాబు : ఖరీఫ్‌లో 9,200 ఎకరాల్లో వరి, జొన్న, కంది, ఆముదం తదితర పంటలు సాగవుతాయని అంచనా రూపొందించాం.

ప్రశ్న : వానాకాలానికి అవసరమైన ఎరువులు, విత్తనాలు సిద్ధం చేస్తున్నారా?

జవాబు : వానాకాలం పంటలకు ఎరువులు, విత్తనాలు సిద్ధం చేస్తున్నాం. సొసైటీతో పాటు ఇతర దుకాణాల్లో ఎరువులు, విత్తనాలు సిద్ధంగా ఉంచేలా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న : సేంద్రియ సాగుపై రైతులకు ఏమైనా అవగాహన కల్పిస్తున్నారా?

జవాబు : అవగాహన కల్పిస్తున్నాం. తక్కువ ధరలకు జీలుగ, జనుము విత్తనాలను అందించేందుకు కృషి చేస్తున్నాం. మెట్ట, వరి పంటలకు పశువుల ఎరువులు వాడితే కలిగే లాభాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న : రైతుబీమా కింద ఎంతమంది రైతులకు సాయమందించారు?

జవాబు : ఇటీవల 24మంది రైతులకు రైతుబీమా అందించాం. అలాగే రైతుభరోసా కింద 16,200 మందికి సాయమందించాం.

ప్రశ్న : మండలంలో సాగుచేసే భూములు ఎన్ని ఎకరాలున్నాయి?

జవాబు : మండలంలోని వివిధ గ్రామాల్లో మొత్తం 38,863 ఎకరాల భూములు సాగుకు యోగ్యంగా ఉన్నాయి.

ప్రశ్న : పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారా?

జవాబు : పంటలకు సోకే చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన అంశాలపై తరచూ రైతులకు రైతు వేదికల్లో అవగాహన సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాం. భూసార పరీక్షలు చేసుకొని మందులు వాడాలని రైతులను చైతన్యపరుస్తున్నాం. చెరువులు, కుంటల్లో ఉన్న టిక్కిమట్టిని ఎరువుగా వాడాలని కూడా చెబుతున్నాం.

మురికి కూపం.. ఉప్పరాశి కుంట

(5వ పేజీ తరువాయి)

సర్వే నెంబర్ 65లో 14.25 ఎకరాల విస్తీర్ణంలో ఉప్పరాశి కుంట విస్తరించి ఉంది. ఒకప్పుడు వర్షం నీటితో కుంట కళకళలాడేది. కాల క్రమేణా చెరువు భూమి ఆక్రమణలకు గురైంది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల నిర్మాణాలు, దుకాణ సముదాయాలు చేపడుతున్నా సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తమ స్వార్థం కోసం గతంలో 10-15 ఫీట్లు ఉన్న ఉప్పరాశి కుంట కట్టను సమీప ఇళ్ల నిర్మాణ దారులు చెరువు లోపలి భాగంలోకి మట్టిపోయడంతో 30 ఫీట్ల వెడల్పుకు చేరుకుంది. ఎఫ్‌టీఎల్‌లోకి వచ్చే భూముల్లో కూడ ఇటీవల కొందరు నాయకులు చేతి వాటం ప్రదర్శించి ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించి వెంచర్లకు అనుమతులు ఇప్పించినట్లు సమాచారం.

కుంటలోకి మురుగునీరు

కడ్తాల మండల కేంద్రంలో జాతీయరహదారిని అనుసరించి వర్షం నీరు పోవడానికి రోడ్డు నిర్మాణ సమయంలో కాల్వ ఏర్పాటు చేశారు. సమీపంలో ఉన్న కాలనీల ఇళ్లకు చెందిన మురుగు నీటి పైపులైన్లను కూడ ఇదే కాల్వలోకి కలిపారు. దీంతో నివాసాల నుంచి వెలువడుతున్న మురుగు నీరు కుంటలోకి పెద్ద ఎత్తున చేరుతుండడంతో నీరు కలుషితమవుతుంది. దీనికి తోడు వ్యర్థాలను, చెత్తను స్థానికులు రాత్రి వేళల్లో గుట్టు చప్పుడు కాకుండా కుంటలో వేస్తున్నారు. దీంతో కుంట పరిసరాలన్నీ దుర్గంధంతో నిండిపోయాయి. కుంట ఎదురుగానే ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఉంది. మురుగు నీటిలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో అన్మాస్‌పల్లి, సాయిరెడ్డిగూడ, పలు గిరిజన తండాలు, పిరమిడ్‌కు వెళ్లే వారు దుర్గంధాన్ని భరించలేక ఇబ్బందులు పడుతున్నారు.



సుందరీకరణ పనుల కోసం వేసిన శిలాఫలకం

అటకెక్కిన సుందరీకరణ పనులు

ఉప్పరాశి కుంట సుందరీకరణ పనులు శంకుస్థాపనకే పరిమితమయ్యాయి. పనుల నిర్వహణ విషయంలో ఎవరూ చొరవ తీసుకోవడం లేదు. ఉప్పరాశి కుంటను ఆక్రమణల నుంచి కాపాడి సుందరీకరించాలని ఏళ్ల కాలంగా స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దీంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎస్డీఎఫ్‌లో సుందరీకరణకు రూ.20 లక్షలు కేటాయించారు. పనులకు 2023 సెప్టెంబర్ 8న అప్పటి ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ శంకుస్థాపన చేశారు. తదనంతరం ఎన్నికలు రావడం, పనులు చేపట్టకపోవడంతో నిధులు వెనక్కి మళ్లినట్లు సమాచారం. దీంతో ఉప్పరాశి కుంట సుందరీకరణ పనులు శంకుస్థాపన శిలాఫకానికే పరిమితమయ్యాయి.

సుందరీకరణ పనులు చేపట్టాలి



బీఆర్ఎస్ ప్రభుత్వం 2023లో ఉప్పరాశి కుంట సుందరీకరణ పనులకు రూ.20 లక్షలు మంజూరు చేసింది. అప్పటి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత వరుసగా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల కోడ్ కారణంగా పనులు చేపట్టడంలో జాప్యం జరిగింది. నిధులు వెనక్కి మళ్లాయి. రాష్ట్ర ప్రభుత్వం కడ్తాల ఉప్పరాశి కుంట సుందరీకరణకు తిరిగి ప్రత్యేక నిధులు కేటాయించాలి.

- జీఎల్ఎన్ రెడ్డి, మాజీ సర్పంచ్, కడ్తాల్

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



ప్రవీణ్ (ఫైల్)

కందుకూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): అనుమానస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన ఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ధన్నారం గ్రామంలో శనివారం ఉదయం చోటు చేసుకుంది. బాధితుల ఫిర్యాదు మేరకు.. ధన్నారం గ్రామానికి చెందిన మంద ప్రవీణ్(36)కు నగరంలోని చంద్రాయణగుట్టకు చెందిన శిరీషతో 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక బాబు, పాప ఉన్నారు. ఇటీవల శిరీష అదే గ్రామానికి చెందిన బతకామోని అళివేలు, చెవులపల్లి మహేష్‌లతో స్నేహం పెంచుకొని భర్త ప్రవీణ్‌పై దురుసుగా ప్రవర్తించేది. ఈక్రమంలో అనుమానాస్పదంగా ప్రవీణ్ ధన్నారంలో శవమై కనిపించాడు. కాగా, శిరీష, అళివేలు, చెవులపల్లి మహేష్‌లు ప్రవీణ్‌ను హత్య చేశారంటూ మృతుడి తమ్ముడు శ్రీకాంత్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు సీఐ సీతారాం కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. సీఐ నేతృత్వంలో ఎస్సై సైదులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి



ఆదిభట్ల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. సుమారు 50 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు కలిగిన వ్యక్తి మంగళవారం రాత్రి తుర్కయంజాల్ మాసాబ్ చెరువు కట్టపైన బుద్ధుడి విగ్రహ దగ్గర రోడ్డు దాటుతుండగా బీఎన్‌రెడ్డి నగర్ వైపు నుంచి తుర్కయంజాల్ వైపు వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు చికిత్స నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై రాజు తెలిపారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి



చేవెళ్ల : ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు



ఆమనగల్లు : ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

చేవెళ్ల/యాచారం/ఆమనగల్లు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో కాల్పులు జరిపి భారతీయుల ప్రాణా లు తీసిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని న్యాయవాదులు అన్నారు. శనివారం చేవెళ్ల కోర్టు బార్ అసోషియేషన్ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య మద్దతు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహేశ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్, న్యాయవాదులు తదితరులు ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ యాచారం మండలాధ్యక్షుడు మస్కు నర్సింహాతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు శుక్రవారం రాత్రి మండల కేంద్రంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, నర్రె శ్రీశైలం, ప్రవీణ్‌యాదవ్, తదితరులున్నారు. ఉగ్రవాద నిర్మూలనలో కేంద్రం కఠినంగా వ్యవహరించాలని పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జగన్‌లు అన్నారు. ఆమనగల్లు పట్టణంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులతో కలిసి ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు.

'భూ భారతి'తో సమస్యల పరిష్కారం

(5వ పేజీ తరువాయి)

ఎకరాల భూమిని దిగమింగారన్నారు. భూభారతి చట్టం ద్వారా అవినీతికి తావులేకుండా భూసమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సునిత, తహసీల్దార్ రాజేశ్వర్, ఎంపీడీవో సుమతి, కాంగ్రెస్ నాయకులు శివశంకర్‌గౌడ్, జిల్లెల్ల రాంరెడ్డి, జంగ నర్సింలు, కొమ్ము క్రిష్ణ, చంద్రపాల్‌రెడ్డి, దేపల్లి కుమార్‌గౌడ్, కావలి క్రిష్ణ, పసుల బుచ్చయ్య, పాములయ్య, సాలయ్య, వీరేందర్, వేణు, సీతారాములు, దార లింగం, సి. క్రిష్ణగౌడ్, జంగయ్య, శ్రీశైలం, యాదయ్య, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూర్‌లో అవగాహన సదస్సు

కొత్తూర్ : కొత్తూర్ మున్సిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సుకు కలెక్టర్ నారాయణరెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. మోసపూరితంగా హక్కుల రికార్డులు మార్చి ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వక్ఫ్ భూములకు పట్టాలు పొందితే రద్దు చేసే అవకాశం భూభారతి చట్టం ద్వారా ఉంటుందన్నారు. భూభారతి చట్టం ద్వారా రెవెన్యూలోని కొన్ని సమస్యలు ఆర్డీవో, తహసీల్దార్ స్థాయి అధికారులతోనే పరిష్కరించబడుతాయని వివరించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణితో రైతులు అనేక నష్టాలను చవిచూడాల్సి వచ్చిందని గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ధరణిని బంగాళాఖాతంలో కలిపి రైతు ప్రయోజనాల కోసం భూభారతి చట్టాన్ని తీసుకరావడం జరిగిందన్నారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ఆర్డీవో ఎస్ఆర్ సరిత, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఎంపీడీవో డాక్టర్ అరుంధతీ, వ్యవసాయ శాఖ ఏడీఏ రాజారత్నం, స్థానిక వ్యవసాయాధికారి గోపాల్, మున్సిపల్ కమిషనర్ బాలాజీ, షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్‌అలీఖాన్, మున్సిపల్ వైస్‌చైర్మన్ జోలీ రవీందర్ పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తే కఠిన చర్యలు

షాబాద్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): అసైన్డ్ భూముల్లో నుంచి అనుమతి లేకుండా మట్టిని తరలిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ అన్వర్ హెచ్చరించారు. మండల పరిధిలోని సోలిపేట రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 350లోని అసైన్డ్ భూమిలో శుక్రవారం జేసీబీతో మట్టిని తవ్వి తరలిస్తుండగా.. అధికారులు నాలుగు టిప్పర్ల టైర్లలో గాలి తీసినట్లు తహసీల్దార్ చెప్పారు. అయితే, మండల పరిధిలోని హైతాబాద్, చందన్‌వెల్లి, సీతారాంపూర్ పారిశ్రామిక వాడల్లో మట్టికి చాలా డిమాండ్ ఉండడంతో దందా జోరుగా సాగుతోందని సమాచారం. కొందరు పక్క గ్రామాల వ్యక్తులు మట్టి తవ్వకాలు జరుపుతున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయం



సులేమాన్‌ను సత్కరిస్తున్న సీపీ సుధీర్‌బాబు

కందుకూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు అన్నారు. మండలంలోని మహ్మద్‌నగర్ గ్రామంలో రూ.2 లక్షలతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసిన మండల పరిషత్ కో-ఆప్షన్ మాజీ సభ్యుడు ఎండీ సులేమాన్‌ను శనివారం ఘనంగా సత్కరించారు. మహేశ్వరం పరిధిలోని మల్లాపురంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో సీపీ మాట్లాడారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి, కందుకూరు సీఐ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయ నిర్మాణానికి రూ.27 లక్షల విరాళం



చెక్కు అందిస్తున్న రియల్టర్ సర్వోత్తమ్‌రెడ్డి దంపతులు

నందిగామ, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చేగూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ ఆలయ నిర్మాణానికి శనివారం రియల్‌ఎస్టేట్ వ్యాపారి సర్వోత్తమ్‌రెడ్డి దంపతులు రూ.27లక్షల విరాళం అందించారు. ఈమేరకు చెక్కును గ్రామస్థులకు అందజేశారు. హనుమంతుని జీవితమే మానవాళికి ఆదర్శమని, గుడి నిర్మాణంలో భాగస్వామ్యం అవ్వడం అదృష్టమని సర్వోత్తమ్‌రెడ్డి అన్నారు. గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, అంజంగౌడ్, మంకాల శ్రీశైలం, ఆవుల శివ, పబ్బె నరేందర్, కృష్ణయ్య, నిరంజన్‌గౌడ్, భాస్కర్‌గౌడ్, అన్నారం నర్సింహ, రవితేజ, వెంకట్‌చారి, నరేష్, ప్రణవ్ తదితరులున్నారు.

బీరప్ప ఉత్సవాలకు తరలిరావాలి



ఉత్సవాల పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మె సత్యనారాయణ

కొత్తూర్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎస్‌బీ పల్లి గ్రామంలో నిర్వహించే బీరప్ప ఉత్సవాలకు భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని షెపర్డ్ ఇండియా ఇంటర్నేషనల్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్మె సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఏప్రిల్ 30 నుంచి మే 8వరకు నిర్వహించే ఉత్సవాలను పురస్కరించుకుని జోగిత్తడం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మె సత్యనారాయణ ఉత్సవాల కరపత్రాన్ని విడుదల చేశారు. మాజీ సర్పంచ్ ఎమ్మె వెంకటయ్య, కురుమ సంఘం నాయకులు ఎమ్మె దర్శన్, సెల్వాజి శ్రీనివాస్, ఎమ్మె అజయ్, శ్రీశైలం, పాండు తదితరులున్నారు.

గులాబీ జెండా.. తెలంగాణకు అండ

ఆమనగల్లు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): గులాబీ జెండా, కేసీఆర్ నాయకత్వం తెలంగాణకు కొండంత అండ అని ఆమనగల్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోనుగోటి అర్జున్‌రావు అన్నారు. ఆమనగల్లు మండలం శెట్టిపల్లిలో శనివారం అర్జున్‌రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభ ఏర్పాట్లపై సన్నాహక సమావేశం నిర్వహించారు. సభకు సంబంధించిన పోస్టర్లను స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో గులాబీ జైత్ర యాత్ర రజతోత్సవంతో మొదలవుతుందన్నారు. రాష్ట్ర ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమై ప్రజా విశ్వాసం కోల్పోయిందన్నారు. వెంకటయ్య, జంగయ్య, కేశయ్య, మైసయ్య, రాములు గౌడ్, రంగారావు, జంగయ్య, లక్ష్మణ్, పోచయ్య, తదితరులున్నారు. అలాగే ఆమనగల్లు మున్సిపాలిటీ 5వ వార్డు శ్రీనివాసకాలనీలో బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలు బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చలిచీమల సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్ ముఖ్య అతిథిగా హాజరై బీఆర్ఎస్ జెండాను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కేక్‌కట్ చేసి ప్రజలకు స్వీట్లు పంచిపెట్టారు. సయ్యద్ ఖలీల్, సైదులు గౌడ్, సురమళ్ల సుభాష్, జంతుక కిరణ్, భరత్, కార్తీక్, వెంకటేష్, జంతుక శివ, తదితరులున్నారు. 11వ వార్డులో నాయకుడు జహంగీర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ జెండావిష్కరణ చేశారు. ఎనుముల రమేశ్, రంజిత్, ప్రసాద్, గణేశ్, వీరయ్య, యాదయ్య, మహేశ్, బాబా, సాయిలు, సైదులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ జెండాను ఎగురవేస్తున్న పత్యానాయక్, సతీష్

ప్రజల ఆర్థికాభివృద్ధే ధ్యేయం : కసిరెడ్డి



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు, ఏ ప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పథకాలు రూపొందించి అమలు చేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో శనివారం ఎమ్మెల్యే పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వివిధ మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం సమావేశంలో నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు పారదర్శక పాలన అందించేందుకు ప్రభుత్వం అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టిందన్నారు. ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, నర్సింహ, భాస్కర్‌రెడ్డి, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, బొజ్జ సాయిరెడ్డి, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు పట్నంలో 'జన జాతర సభ'

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నేడు(ఆదివారం) ఇబ్రహీంపట్నంలో పూలే, అంబేడ్కర్ మహనీయుల జన జాతర సభను నిర్వహిస్తున్నట్లు కేవీపీఎస్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు బిసామ్యేల్, ప్రకాశ్‌కారత్‌లు ప్రకటనలో పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం చౌరస్తాలో జరిగే ఈ సభలో ముఖ్య వక్తలుగా ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జేబీ రాజు, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు పాల్గొంటున్నట్లు వారు పేర్కొన్నారు.

ఫత్తేపూర్ బ్రిడ్జిపై రోడ్డు పనులు షురూ

శంకర్‌పల్లి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఫత్తేపూర్ బ్రిడ్జిపై రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. రోడ్డు భవనాల శాఖ ఏఈ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. బ్రిడ్జిపై పాడైన రోడ్డును జేసీబీతో తొలగించారు. కాగా, ఒక పక్కన పూర్తిగా తొలగించి సీసీ రోడ్డు వేయనున్నారు. అది పూర్తయిన వెంటనే మరో పక్కన రోడ్డును పూర్తిచేయనున్నారు. కాగా, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్‌ను పోలీసులు దగ్గరుండి నియంత్రిస్తున్నారు. రోడ్డు పనులు ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కార్మికులు ఐక్యంగా ఉండాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

చేవెళ్ల ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కార్మికులు ఐకమత్యంగా ఉంటూ హక్కులను సాధించుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ తెలిపారు. శనివారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో కార్మిక సంఘం ఆధ్వర్యంలో మేడే పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 8 గంటల పని విధానం వల్ల ప్రాణాలు కోల్పోయిన కార్మికులను స్మరించుకుంటూ మేడేను విజయవంతం చేయాలన్నారు. కేంద్రం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌ల రద్దు కోసం కార్మికులు ఐక్యంగా ఉద్యమాలు చేపట్టాలన్నారు. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని కార్మికులు తదితరులున్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



పనులను ప్రారంభిస్తున్న రాజు

చౌదరిగూడ, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లేడ్ చౌదరిగూడ మండలాధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు అన్నారు. శనివారం జిల్లేడ్‌లో రూ.7లక్షలతో చేపట్టే అండర్‌డ్రైనేజీ నిర్మాణ పనులు, చౌదరిగూడలో గొల్లకేరి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు రోడ్డు డివైడర్ కోసం వదిలిన దగ్గర సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. చౌదరిగూడ రైతు వేదికలో తైవాన్ పంపులను రైతులకు అందజేశారు. ఏవో రాజేందర్‌రెడ్డి, ఏఈవోలు గౌరీప్రియ, సోనిశ్రీ, నాయకులు ఎల్లేశ్వర్, సత్తయ్య, శశిధర్, తదితరులున్నారు.

ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేయాలి



ఎమ్మెల్యే మల్‌రెడ్డితో డీపీవో సురేశ్‌మోహన్, ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, వైవీ రాజులు

యాచారం, ఏప్రిల్ 26(ఆంధ్ర జ్యోతి): మండలంలోని ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి అధికారులు చొరవ తీసుకోవాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, డీపీవో సురేష్‌మోహన్‌లు అన్నారు. యాచారం మండలం మాల్ గ్రామానికి జాతీయ స్థాయిలో ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డును ఈ నెల 24న బీహార్‌లోని మధుబనిలో ప్రధాని చేతులమీదుగా పంచాయతీ కార్యదర్శి వైవి రాజు అందుకున్నారు. శనివారం ఎంపీడీవో జి.నరేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీలత, పంచాయతీ కార్యదర్శి వైవీ రాజులు నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో కలిశారు. దాంతో ఆ యన అధికారులను అభినందించారు. అధికారులు అంకితభావంతో పనిచేస్తే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని ఎమ్మెల్యే తెలిపినట్లు వారు పేర్కొన్నారు.

సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలి



తైవాన్ పంపులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

చౌదరిగూడ, ఏప్రిల్ 26(ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం షాద్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాలకు చెందిన రైతులకు సబ్సిడీపై మంజూరైన 14 యూనిట్ల తైవాన్ పవర్ స్ప్రేయర్ పంపులను రైతులకు పంపిణీ చేశారు. షాద్‌నగర్ ఏడీఏ రాజరత్నం, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ కొందుర్గు మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, జిల్లేడ్ చౌదరిగూడ ఏవో రాజేందర్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, ఇబ్రహీం, కరుణాకర్, వెంకటేష్, నవీన్‌గౌడ్ తదితరులున్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

కడ్తాల్/మాడ్గుల, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పేదలకు వరమని పీఏసీఎస్ డైరెక్టర్, కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. రావిచెడ్‌కు చెందిన ఎండీ ఆరిఫ్‌కు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మంజూరైన రూ.42వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును శనివారం బాధిత కుటుంబానికి అందజేశారు. జనార్దన్ గౌడ్, దైవాదీనం గౌడ్, రాఘవేందర్, రాంరెడ్డి, తదితరులున్నారు. మాడ్గుల మండలం అందుగులకు చెందిన కొప్పుల గిరిగౌడ్, ధనలక్ష్మిలు అనారోగ్యంలో బాధపడుతూ ప్రవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. సీఎంరిలీఫ్ ఫండ్ కింద గిరిగౌడ్‌కు రూ.60వేలు, ధనలక్ష్మికి రూ.14వేలు మంజూరయ్యాయి. ఈమేరకు సింగిల్‌విండో డైరెక్టర్ జగన్ బాధితులకు శనివారం చెక్కులను అందచేశారు.

సంక్షిప్తంగా..

మాడ్గుల : మండలంలోని రైతుల అభిప్రాయం తెలుసుకోకుండా భూభారతి ఆర్‌వోఆర్ చట్టంపై కలెక్టర్ నారాయణరెడ్డి అవగాహన కల్పించడం, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కాంగ్రెస్ ప్రచార సభగా మార్చటం ఎంతవరకు సమంజసం అని బీజేపీ మండలాధ్యక్షుడు నల్లకానుల పెద్దయ్య విలేకర్ల సమావేశంలో విమర్శించారు. ఎమ్మెల్యే భూభారతి ఆర్‌వోఆర్ చట్టంపై రైతులకు వచ్చే అనుమానాలను, అపోహలను చర్చిద్దామని సీఎంఆర్ఎఫ్ చెక్కులను, మోటార్లను పంపిణీ చేయటంతో పాటు కాంగ్రెస్ పథకాలను వివరించడంతో ప్రచార సభగా మారిందన్నారు. మెట్టు శ్రీను, ఎమ్మె పర్వతాలు ఉన్నారు.

కడ్తాల్ : మండల పరిధిలోని ఎక్వాయిపల్లి గ్రామానికి చెందిన బాలయ్య, సాదక్‌బీ, ఇందిరానగర్ తండాకు చెందిన కోమిటిలు అనారోగ్యంతో మృతిచెందారు. బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ గ్రామ నాయకుడు జెనిగల మహేశ్ యాదవ్ పరామర్శించారు. కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు ఎండీ మోహిన్, సింహాద్రి, నవీన్, శ్రీను, నర్సింహ్మా, అశోక్, సురేశ్, తదితరులున్నారు.

ఆమనగల్లు : అంగన్‌వాడీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక కోరారు. చెన్నంపల్లి అంగన్ వాడీ కేంద్రంలో శనివారం ఎర్లీచైల్డ్ కేర్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాధిక ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోషకాహార విలువల గురించి వివరించారు. టీచర్ రాములమ్మ, ఆయా చెన్నమ్మ, తల్లిదండ్రులు, తదితరులున్నారు.

తలకొండపల్లి : వెంకటాపూర్‌లో శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ముగిశాయి. మూడు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నిర్వాహకులు భక్తులకు విశాల వసతులు ఏర్పాటు చేశారు. ముగింపు వేడుకల్లో భాగంగా ప్రత్యేక పూజలు, స్వామి వారి ఊరేగింపు, బ్రాహ్మణులు, దాతలకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఆలయ చైర్మన్ శేఖర్ గౌడ్, అంజన్‌రెడ్డి, రమేశ్‌యాదవ్, అర్చకులు, యాదగిరి నర్సింహ శాస్త్రి, కామేశ్వర శాస్త్రి, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

కేశంపేట : పాపిరెడ్డిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉచిత స్పోకెన్ తరగతులను మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. క్లాసులు నిర్వహించినన్ని రోజులు విద్యార్థులకు స్నాక్స్ అందించనున్నట్లు తెలిపారు. రవీందర్‌రెడ్డి, మల్లేష్, స్పోకెన్ ఇంగ్లీష్ అధ్యాపకుడు శ్రీశైలం పాల్గొన్నారు.

కందుకూరు : మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో రేపు(సోమవారం) ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆ సంఘం సీఈవో నిమ్మ యాదగిరిరెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం 10:30 గంటలకు సహకార సంఘం చైర్మన్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రారంభించనున్నట్లు తెలిపారు.